ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు


5★

గురువారం 13 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:28 గురువారం

సహర్ 5:06 శుక్రవారం




పెద్దపల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దపల్లిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అమర్‌నగర్ నుంచి పెద్ద మజీద్ వరకు, దేవిడి నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు టీడీఎఫ్ ఐడీసీ నిధుల ద్వారా జరుగుతున్న రోడ్డు వెడెల్పు పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్,వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

- ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం
- ఈ నెలాఖరు వరకు 25 శాతం రాయితీ
- రిజిస్ట్రేషన్లు నిలిచి పోవడంతో క్రయ, విక్రయదారుల ఆందోళన

రిజిస్ట్రేషన్‌కు ఎల్‌ఆర్‌ఎస్ బ్రేకులు



పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించకపోతే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కాకుండా ప్రభుత్వం బ్రేకులు వేసింది. నాలా కన్వర్షన్ అయి ఎల్‌ఆర్‌ఎస్ లేకుంటే రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ రుసుంతో పాటు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొంత మేరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపో యాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారిక లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వగా, తద్వారా చెల్లించాల్సిన రుసుం ఎక్కువగా ఉండడంతో ఎవరూ ఆసక్తి చూపలేదు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతంగా ముందుకు సాగేందుకు ప్రస్తుత ప్రభుత్వం 2020 చట్టం ప్రకారం నిబంధనలను అనుసరించి ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతి ఇచ్చింది. మార్చి 31వ తేదీ వరకు రుసుం చెల్లించే వారికి 25 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించింది. దీనిపై దరఖాస్తుదా రుల నుంచి అంతగా స్పందన రాకపోవడంతో జిల్లా కలెక్టర్లు స్వయంగా పట్టణా లకు వెళ్లి అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మున్సి ఎల్ కమిషనర్లు సైతం విస్తృత ప్రచారం చేస్తు న్నారు. ప్రభుత్వం ప్రకటిం చిన రాయితీ గురించి ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నా రు. అయితే దరఖాస్తుదారుల నుంచి అంతగా స్పందన రాకపోవడంతో రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టారు.

● ఎల్‌ఆర్‌ఎస్ కోసం 25,512 దరఖాస్తులు

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల్లో అక్రమ లే అవుట్లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020 సెప్టెంబర్ 1న బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇందులో భాగంగా 2020, ఆగస్టు 26లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించినట్లు ప్రకటించింది. అందులోని లే అవుట్ నిబంధనలను సవరిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2021లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం అప్పటి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఆ మేరకు పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 9,675 దరఖాస్తులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7,078 దరఖాస్తులు, సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో 1,531 దరఖాస్తులు, మంథని మున్సిపల్ పరిధిలో 894 దరఖాస్తులు, పెద్దపల్లి రూరల్ ఏరియాలో 6,334 దరఖాస్తులు, మొత్తం 25,512 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఎల్‌ఆర్‌ఎస్‌పై అప్పటి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తాము అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ లేకున్నా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలని ప్రకటించారు. మార్చి 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునే వారికి రుసుంలో 25 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ లేకుండానే ఇళ్లకు అనుమతులు ఇస్తామన్న నాయకులు అధికారంలోకి రాగానే మాట మార్చారని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు.

● ఆదాయం పెంచుకునేందుకే

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో అల్లాడుతున్నది. ఈ తరుణంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కొంత ఆదాయాన్ని సమకూర్చు కోవచ్చని భావించి ఎల్‌ఆర్‌ఎస్‌పై 25 శాతం రాయితీ కల్పించింది. స్పందన అంతంత మాత్రంగానే ఉండడంతో నాలా కన్వర్షన్ పూర్తయి న ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించింది. 2020 ఆగస్టు 26న కొత్త ప్లాట్లకు (అక్రమ లేఅవుట్లకు) రిజిస్ట్రేషన్లను అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. ప్లాటుకు ఏదైనా లింకు డాక్యుమెంట్ ఉండి ఒకసారి విక్రయించి ఉంటే రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చింది. ఇదే సమయంలో అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం

(మిగతా 8వ పేజీలో)

31లోగా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేసుకోవాలి

● జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్



ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్

సుల్తానాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజ్ చేయించుకోవడానికి ఈ నెల 31 వరకు ఆవకాశం కల్పించిందని ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్, స్టాంపుల శాఖ జిల్లా అధికారి బి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సబ్ రిజిస్ట్రార్ బాకం ఓం ప్రకాష్ ప్రజలకు, దస్తావేజు లేఖరులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భవిష్యత్తులో అన్ని అనుమతులు సులభతరం అవుతాయని అన్నారు. ఈ నెల 31లో ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుని ప్రభుత్వం కల్పించిన ఇరవై ఐదు శాతం రిబేట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో భూయజమానులను చైతన్యం చేయించి ఫీజు చెల్లించేలా చూడాలన్నారు.

విద్యాభ్యసన సామర్థ్యాల పరిశీలన

పెద్దపల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం పాఠశాల విద్యా మండలి రీసెర్చ్, శిక్షణ సంస్థ టీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో విద్యాభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, లైబ్రరీ, మధ్యాహ్న భోజనం మొదలైన అంశాలను పరిశీలించారు. అనంతరం సభ్యులు గణపతిశర్మ, జగన్‌మోహన్‌లు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వారి వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు, పాఠశాల హెచ్‌ఎం సతీష్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

పెద్దపల్లి రూరల్ , మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముదిరాజ్‌లకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, విద్యార్థుల హాస్టల్ భవనం కోసం స్థలం కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుకు వినతిపత్రం అందించారు.ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్షయాభై వేల పైబడి ముదిరాజ్ కులస్థుల జనాభా ఉందని పూర్వం నుంచి కులవృత్తిపై ఆధారపడి ఉన్నారన్నారు. తమను ఆదుకుని కమ్యూనిటీ భవనం, హాస్టల్ భవనానికి స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలోని ముదిరాజ్‌లు మహేందర్, ముత్యాల రాజయ్య, చుంచు సదయ్య, అంజి, సంపత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన మహిళల వివాదం

కోల్‌సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్ మార్కెట్‌లో బట్టల షాపులో పనిచేసే ఇద్దరు మహిళలను ఒక వ్యాపారి వేధిస్తున్నాడనే ఆరోపణలు వివాదాన్ని రేపాయి. ఒక బోళ్ల షాపు యజమాని పక్కనే ఒక రెడిమేడ్ బట్టలషాపులో పనిచేసే ఇద్దరు మహిళా ఉద్యోగులకు ఫోన్లు చేసి వేధిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. బుధవారం ఉదయం సదరు మహిళలు బోళ్ల షాపునకు వచ్చి గొడవకు దిగారు. తోటి వ్యాపారులు రాజీ చేసే ప్రయత్నం చేశారు. అనంతరం తీవ్ర గొడవ జరిగింది. సదరు వ్యాపారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు వ్యాపారులు జోక్యం చేసుకుని రాజీ చేసినట్టు తెలుస్తున్నది.

రోడ్డు మళ్లింపు పనులు అడ్డగింత

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్‌లో పెద్దపల్లి ప్రధాన రహదారి మళ్లింపు పనులను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. సింగరేణి సంస్థ తమకు పన్నూర్ పరిధిలో ఇచ్చిన ఆర్‌అండ్‌ఆర్ ప్లాట్స్‌లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై పటిష్ట కార్యాచరణ అమలు చేయాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ● సుల్తానాబాద్ పట్టణంలో విస్తృత పర్యటన



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్



మున్సిపల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

సుల్తానాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలో మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. సుల్తానాబాద్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోని ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో 1036 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఆమోదించినట్లు తెలిపారు. మార్చి 31లోపు పూర్తి స్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రీబెట్ లభిస్తుందని అన్నారు. పట్టణంలోని వార్డు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి ప్రతి ఒక్క దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తప్పనిసరిగా మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. సుల్తానాబాద్ మండల హెడ్‌క్వార్టర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో జరుగుతున్న అదనపు తరగతుల నిర్మాణ పనులను పరిశీలించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను కలెక్టర్ పరిశీలించారు.ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు నిర్వహించాలని, ఎమర్జెన్సీ కేసులు ఉంటే కరీంనగర్ లేదా పెద్దపల్లి ఆసుపత్రులకు తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జనరల్ ఓపి సంఖ్య పెరిగేలా చూడాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పారిశుధ్య నిర్వహణ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోని ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ పరిశీలించారు. సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



హాజరైన బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది

● సీపీ అంబర్ కిషోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పారిశ్రామిక ప్రాంతమని, నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. బుధవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టీములు తమ పరిధిలోని ప్రతి విషయం గురించి అవగాహన పెంచుకోవాలని, పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఒక టీముగా పని చేసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. నీట్ టర్న్ అవుట్, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో ఉంటూ ఎదుటి వారికి ఆదర్శంగా ఉండాలన్నారు. వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతల విషయంలో కమ్యూనల్ సమస్యలనేవి కులాలు, మతాలు, గ్రూపుల మధ్య జరిగేవని, అలాంటివి తమ తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగే అవకాశాలను అంచనా వేసుకోవాలని, కారణాలను తెలుసుకుని వెంటనే సంఘటన స్థలాలకు చేరుకోవాలని, పరిస్థితులను వెంట వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బ్లూకోల్ట్స్ డ్యూటీలో 24గంటలు అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందన్నారు. నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ అధికారుల పాత్ర కీలకమన్నారు. డయల్ 100కాల్ వచ్చిన వెంటనే వేగంగా స్పందించాలని, తక్కువ సమయంలో ఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ ఇన్‌చార్జిలు ఉన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను పెంచండి

● పార్లమెంట్‌లో ఎంపీ వంశీకృష్ణ

గోదావరిఖని, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 35సంవత్సరాలు మృత్యుగుహల్లో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన సింగరేణి రిటైర్డ్ కార్మికులకు చాలీచాలని పెన్షన్ వస్తుందని, పెన్షన్‌ను కనీసం రూ.10వేలకు పెంచాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పార్లమెంట్‌లో రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌పై గళమెత్తారు. సింగరేణిలో గతంలో మాజీ ఎంపీ వెంకటస్వామి ప్రవేశపెట్టిన పెన్షన్ మాత్రమే వస్తుందని, కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలని, చాలా మందికి వెయ్యి నుంచి రూ.1500మాత్రమే పెన్షన్ వస్తుందని, ఆ పెన్షన్‌తో రిటైర్డ్ కార్మికులు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు.

చేతిరాతలో మెలకువలపై శిక్షణ

ఓదెల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోత్కపల్లి హైస్కూల్‌లో ఎక్స్‌పర్ట్ టాక్‌లో భాగంగా బుధవారం చేతిరాత మెళకువలపై నిపుణుడు రాపెల్లి విజయభాస్కర్ శిక్షణ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని నివారించడానికి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. తెలుగు,ఆంగ్ల భాషలో అందమైన చేతిరాత ఎలా ఉండాలో తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు, నాగేపల్లి, బేగంపేట్, వకీల్‌పల్లికి చెందిన ఐదుగురిని ఎక్సైజ్‌శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేశారు. అదే విధంగా బేగంపేట్ అటవీప్రాంతంలో 20లీటర్ల నాటు సారాయి సీజ్ చేశారు.

ప్రతి దివ్యాంగుడికి యూనిక్ ఐడీ కార్డు అందించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) ప్రతి దివ్యాంగుడికి యూడిఐడి నెంబర్ జనరేట్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో యూనిక్ డిసేబులిటీ ఐడి జారీ, స్కూల్ యూనిఫాంలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి సమీక్ష నిర్వహించారు. దివ్యాంగులకు యుడిఐడి కార్డుల జారీ కోసం సదరన్ క్యాంపులను పరిమితమైన స్లాట్‌లతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్లకు బదులుగా యూనిక్ డిసెబులిటీ ఐడి కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల పనుల కోసం మహిళా సంఘాలలో గల నైపుణ్యం కలిగిన టైలర్లను గుర్తించాలని, పిల్లలకు నాణ్యమైన స్కూల్ యూనిఫాం అందించాలని అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, అడిషనల్ డి ఆర్‌డిఓ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ ద్వారా బోధన

● డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 12,(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని 15ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ(ఏఐ)సహకారంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు డీఈవో మాధవి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలి కోన్నత పాఠశాల సముదాయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యాశాఖ ఏఐని మరింత విస్తరించాలని నిర్ణయించిందన్నారు. జిల్లాలోని 15ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 15నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకొని పిల్లల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎమ్ఓ పిఎం షేక్, ఎంఈఓ సురేందర్, ఆర్‌పి ప్రవీణ్ పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో బుధవారం వీధికుక్కలు దాడిచేసి నలుగురిని గాయపరిచాయి. దీకొండ లక్ష్మి, లింగమ్మ, సిర్ర రిషిక, దయ్యాల లస్మయ్యపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాధితులకు చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స అందించి అనంతరం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. వీధికుక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

జమ్మికుంటలో యువకులపై..


పిచ్చికుక్క దాడిలో గాయపడిన యువకుడు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెం సమీపంలో గల నాయినిచెరువువద్ద బైక్ పై వెళ్తున్న ముగ్గురు యువ కులను పిచ్చి కుక్కల గుంపు వెంబ డించింది. అందులో ఒకపిచ్చి కుక్క దాడి చేయడంతో యువకుడి కాలికి తీవ్రగాయాల య్యాయి. మోత్కుల గూడెంకు చెందిన బిట్ల రాకేష్ అనే యువకుడు తన ఇద్దరు స్నేహితు లతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. నాయిని చెరువు సమీపం వద్దకు రాగానే వారిని పిచ్చికుక్కల గుంపు వెంబడించింది. వెనుకాల కూర్చున్న రాకేష్‌పై ఓ పిచ్చికుక్క దాడిచేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. స్నేహితులు వెంటనే అతన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక వైద్యం అందించారు.

శంకరపట్నంలో కుక్క, కోతుల దాడి

శంకరపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కుక్క, కోతులదాడిలో పలువురు గాయపడ్డారు. కేశవపట్నం గ్రామానికి చెందిన స్రవంతి కుక్కదాడిలో గాయపడగా, చింతలపల్లికి చెందిన మల్లారెడ్డి, అంబాలాపూర్‌కు చెందిన మణెమ్మ, మొలంగూర్‌లో జ్యోతిపై కోతులు దాడిచేయడంతో గాయపడ్డారు. కేశవపట్నం పీహెచ్‌సీలో గాయపడిన వారు చికిత్స తీసుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానని మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసు

జగిత్యాల క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌దేశానికి పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనేవ్యక్తి ఉపాధికోసం గల్ఫ్ వెళ్లేందుకు జగిత్యాలకు చెందిన అల్లెపు వెంకటేష్ అనే వ్యక్తికి 2022 సంవత్సరంలో రూ.3.5లక్షల నగదు చెల్లించాడు. 2023 సంవత్సరంలో ఆర్మీనియా దేశానికి వెళ్లిన రాకేష్ కొద్ది నెలలకే అక్కడ ఉపాధి లేక స్వదేశానికి తిరిగి వచ్చాడు. తాను మోసపోయానని తెలుసుకుని గల్ఫ్ దేశానికి పంపించిన వెంకటేష్‌ను డబ్బులు తిరిగిచెల్లించాలని నిలదీశాడు. మరోసారి వెంకటేష్ మాయమాటలు విన్న రాకేష్ 2025 జనవరిలో థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ వెంకటేష్‌కు సంబంధించిన వ్యక్తులు రాకేష్‌ను కలిసి బ్యాంకాంగ్ తీసుకవెళ్లి సరైనఉద్యోగం చూపించకుండా ఓ సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పజెప్పారు. దీంతో మరోసారి మోసపోయానని తెలుసుకున్న రాకేష్ ఇండియన్ ఎంబసీ సహాయంతో ఇటీవల స్వదేశానికి వచ్చాడు. తనకు జరిగిన మోసంపై రాకేష్ బుధవారం జగిత్యాల పట్టణపోలీసులకు ఫిర్యాదుచేయగా వెంకటేష్‌పైచీటింగ్ కేసునమోదుచేసినట్లు టౌన్‌సీఐవేణుగోపాల్ పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వీణవంక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామనికి చెందిన దొండపాటి సంపత్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంపత్ రెడ్డి, ఇంటి ముందు గేటు నిర్మిస్తుండగా అదేగ్రామానికి చెందిన దొండపాటి భగవాన్ రెడ్డి, దొండపాటి పద్మ నానా భూతులు తిడుతూ పిల్లర్లు పగలగొట్టడంతో పాటు గడ్డపారతో సంపత్‌రెడ్డిపై దాడిచేయగా తలకు గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన బుర్ర వికాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి న్యూసెన్స్ చేశాడని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు


మల్యాల మండలంలో వ్యవసాయ క్షేత్రాలకు ఏర్పాటు చేసిన రహదారి

జగిత్యాల జిల్లాలో మల్యాల నంబర్‌వన్

సగటున 44.11శాతం కూలీలకు పని

మల్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మల్యాల మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. మండలంలోని 19 గ్రామాల పరిధిలో 10,593 మందికి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 5,642 కూలీలు పని చేస్తున్నారు. కూలీలకు నిత్యం రూ.275 నుంచి రూ.300 వరకు వేతనం లభిస్తుంది. ఇటీవలి కాలంలో మండల వ్యాప్తంగా లక్షా 95వేల112 పని రోజులు పూర్తి కాగా సగటున 44.11శాతం కూలీలకు పని కల్పించారు. రూ.5.21కోట్ల వేతనాలు కూలీలు అందుకున్నారు. ఏడాదిలో 60 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వంద రోజులు పూర్తి అయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా పొలంబాట కార్యక్రమం కింద వ్యవసాయ భూములకు రహదారుల ఏర్పాటు, రైతుల వ్యవసాయ భూముల వద్ద నీటి నిలువ కుంటలు, పశువు పాకలు, చెరువు పూడికతీతలు, ఇంకుడుగుంతలు మామిడి ప్లాంటేషన్ లాంటి పనులు చేపడుతున్నారు.


ఉపాధి పనుల్లో చేపడుతున్న పశువుల పాక నిర్మాణం

కూలీలకు శిక్షణ

2021 నుంచి 2024 వరకు 100 రోజులు పని చేసుకున్న జాబ్‌కార్డు కుటుంబాలలో విద్యార్హతలను బట్టి 18-45 ఏళ్ల లోపు గల 70మందికి అధికారులు ఇటీవల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు ముద్ర బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలోనూ మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటిషియన్ కోర్సు, టైలరింగ్, యువకులకు కంప్యూటర్, ఎలక్ట్రీషన్, ప్లంబింగ్ తదితర శిక్షణ ఇవ్వగా స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలు లభించాయి.

ప్రత్యేక పర్యవేక్షణ:శ్రీనివాస్, ఏపీవో, మల్యాల

ఉపాధిహామీ పనుల్లో జిల్లాలోనే మల్యాల ప్రథమ స్థానంలో నిలుస్తోంది. వంద రోజులకు సమీపంలో గల కూలీలను గుర్తించి వారంతా ఈజీఎస్ పనుల్లో పాల్గొనేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. కూలీల సంఖ్యను మరింత పెంచడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కొనసాగిస్తాం.

అక్రమంగా కట్టిన ఇల్లు సీజ్

సిరిసిల్ల టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కట్టిన ఇల్లును బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ యన్ సుప్రియ సీజ్ చేయించారు. సిరిసిల్ల పట్టణం శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 1578విస్తీర్ణం 1.38గుంటల భూమిలో 40సంవత్సరాల క్రితం అక్రమంగా కట్టి దాదాపు 30పక్కా నివాసగృహాలను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ సుప్రియ పరిశీలించారు. ఇటీవల హైకోర్టుఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ప్రతిఇంటికి రూ.1000 డ్యామేజ్ సూట్ కింద పేమెంట్ చేయాలని సూచించారు. డ్యామేజ్‌చార్జెస్ కట్టనియెడల నివాసగృహాలను కూడా సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కట్టిన ఓనివా సగృహాన్ని సీజ్‌చేయించారు. అనంతరం దేవాలయానికి చెందిన 463సర్వేనంబర్ అండ్611 భూములను పరిశీలించారు.కార్యక్రమంలో ఈవో మారుతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రాయికల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయానికి సమీపంలో ఉన్న ఆవుల పోషణ నిమిత్తం దాతలు అందజేసిన పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు శివసేవకులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు.

79క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో బుధవారం అక్రమంగా మహారాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్‌బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి వ్యాన్ (టీఎస్02 యూఏ1517)ను పట్టుకుని అందులో 79.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, మహారాష్ట్ర సిర్వంచకు ఎల్లంకి వీరన్‌లు మంథని ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో అనుమానం రాకుండా సగానికి లోడ్‌చేసుకుని తరలిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అనుమానం వచ్చి తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. దేశెట్టి మారుతి(26) అనే డ్రైవర్‌ను పట్టుకోగా రాచర్ల రమేష్, ఎల్లంకి వీరన్, ఓదెల మహేందర్‌లు పరారీలో ఉన్నారన్నారు. డీసీఎం వ్యాన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకింద సింగరేణి స్వాధీనం చేసుకున్న సిద్దపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీ చేయగా 106 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 54.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్నారు. వీటిని అక్రమంగా నిల్వ చేసిన ఎండీ రియాజ్‌ను విచారించగా తాను రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి రైతు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

వెల్గటూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగ శ్రీనివాస్ (46) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవి పందులు ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ వెల్గటూర్ మండలం ముత్తునూర్ నుండి కొండాపూర్ గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మంగళవారం రాత్రి కెనాల్ ద్వారా వస్తున్న నీటిని తన పొలానికి పెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామశివారులోని తొండం ప్రాంతంలో అడవి పందులు ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తలకు, ఇతరచోట్ల తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


యాదగిరిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాదగిరిరావు(57) దుర్మరణం చెందాడని కరీంనగర్ రెండోఠాణా పోలీసులు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న యాదగిరిరావును వెనుకవైపు నుంచి కారు అతివేగంగా ఢీకొట్టడంతో కారు బ్యానెట్‌పై పడ్డాడు. అనంతరం కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు, లారీల మధ్య ఇరుకున్న యాదగిరిరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భల్మారి శ్రీలక్ష్మి తిమ్మాపూర్ మండలం పర్లపెల్లిలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, కూతురు మెడికల్ విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు.

రాంనగర్‌లో పట్టపగలే చోరీ

- రూ.4లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రాంనగర్‌లో అయిలాపూర్ పద్మరాణి అనే మహిళ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పద్మరాణి పట్టణంలోని ఇందిరా రోడ్డులో సారి సెంటర్ నడుపుతోంది. మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.4 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామచంద్రుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూజ్ టీం సభ్యులతో తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి


సర్వర్ పాషా (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లింగంపల్లి వెంకన్న(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన వెంకన్న ఫిబ్రవరి 25న మెట్‌పల్లిలో పనులు ముగించుకుని ముత్యంపేటకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వేంపేట గ్రామ శివారులో ఢీకొట్టగా వెంకన్నకు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వెంకన్న మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్..

పెగడపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్ పాషా (55) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న రాత్రి గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుం డగా కారు ఢీకొనడంతో సయ్యద్ సర్వర్‌పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. కాగా అదేప్రమాదంలో గాయపడ్డ సర్వర్ పాషా సోదరుడు జాకీర్‌పాషా పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి బలవన్మరణం

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చొప్పరి శ్రీనివాస్(48) అనేవ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతోపాటు మతిస్థిమితం లేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపులు

- మూడు దశాబ్దాలుగా ఆర్టీసీలో సేవలు
- పదవీ విరమణ చేసి ఏళ్లు గడిచినా అందని బకాయిలు
- ఆర్టీసీలో రిటైర్డ్ కార్మికుల అరణ్యరోదన
- చనిపోయిన తరువాత ఇస్తారా అని ఆవేదన


డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు వారు ఆర్టీసీలో సేవలందించారు. పదవీ విరణ చేసిన తర్వాత వారికి ఆర్థిక భద్రత లేకుండాపోయింది. ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు వారికి రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతో ఆర్‌టీసీ రిటైర్డ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 మంది రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజ మాన్యం ఇప్పటి వరకు చెల్లించ లేదు. ఓ కార్మికుడు బకాయిలు వస్తాయో రావోనని మనోవేదనతో మృత్యువాత పడినా యాజమాన్యం స్పందించడం లేదు. గోదావరిఖని ఆర్టీసీ డిపోలో సుమారు వంద మంది పదవీ విరమణ చేయగా బెనిఫిట్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2015 నుంచి ఫిక్సేషన్ అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కో కార్మికుడికి ఏడు లక్షల నుంచి 23 లక్షల రూపాయల వరకు రావాల్సి ఉంది. మృతి చెందిన కార్మికులకైనా అరియర్స్ చెల్లించాలని వేడుకున్నా యాజమాన్యం తమను పట్టించుకోవడ లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 24న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు గోదావరిఖని డిపో ఎదుట ఆందోళనకు దిగి తమకు రావాల్సిన అరియర్స్‌ను చెల్లించాలని డిపో మేనేజర్ నాగ భూషణానికి వినతిపత్రం అందించారు. పదవీ విరమణ పొంది ఏడేళనా తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో మనోవేదనతో హనుమయ్య అనే డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. పలువురు అనారోగ్యానికి గురై జీవితాన్ని గడుపుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వస్తాయో, రావోనని కలత చెందుతున్నారు. తమ సమస్యలను ఎండీకి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కూడా చాలా తక్కువ వస్తుందని, బకాయిలను చెల్లించే విధంగా కృషి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చావే శరణ్యం...

నాగేందర్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



32ఏళ్లు ఆర్టీసీకి సేవ చేశాం. మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. రిటైర్డ్ అయి ఐదేళ్లు అయినా రూ.23 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. వాటి వడ్డీ కలిపి అరియర్స్‌ను చెల్లించాలి. కుటుంబ పోషణ భారమవుతుంది.

పెన్షన్ కూడా తక్కువే..

కనకయ్య, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



ఆర్టీసీలో నేను 22ఏళ్లు డ్రైవర్‌గా పని చేశా. పెన్షన్ కూడా తక్కువగానే ఉంది. పెన్షన్ రూ.2500 కూడా రావడం లేదు. దీనికి తోడు ఆర్టీసీ నాకు బెనిఫిట్స్‌ను కూడా ఇవ్వలేదు. 2013 నుంచి ఆర్‌పీఎస్ బాండ్ బకా యిలు రావడం లేదు. రెగ్యులర్ ఎంప్లాయిస్‌కు నెల రోజుల్లోనే ఫ్రీక్వెన్సి చేస్తున్నారు. మాకు మాత్రం కాలయాపన చేస్తున్నారు. ఇది సరైంది కాదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం...

తిరుపతి, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



మాకు రావాల్సిన అరియర్స్ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తాం. ఇప్పటికే పలు డిపోల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అవసరమైతే విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి సమ్మెకు దిగుతాం.

మహిళా అఘోరీ హల్‌చల్..

- జిల్లా సరిహద్దులో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
- వేములవాడకు వెళ్లే ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు


మహిళా అఘోరీని తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళాఅఘోరీ జిల్లా సరిహద్దుల్లో మరోసారి హల్‌చల్ సృష్టించింది. బుధవారం జిల్లా సరిహద్దులోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామశివారులో మహిళాఅఘోరీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గతంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న సందర్భంలో దేవస్థానం ప్రాంగణంలో ఉన్నదర్గాను కూల్చివేస్తానని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈక్రమంలో గతనెల ఫిబ్రవరి3న కూల్చివేయడానికి రావడంతో ముందస్తుగానే జిల్లాసరిహద్దులో మహిళా అఘోరీని అడ్డుకొని సిద్దిపేటకు తరలించారు. మరోసారి వేములవాడకు మహిళా అఘోరీ వస్తుందని సమాచారంతో జిల్లాసరిహద్దులో భారీగా పోలీసులను మోహరించారు. సిద్దిపేట-సిరిసిల్ల ప్రధానరహదారిపై జిల్లెల్ల వద్ద 50మంది పోలీసులతో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీచేశారు. మధ్యాహ్నం నుంచే పోలీస్ చర్యలు మొదలవగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జిల్లాసరిహద్దుకు మహిళా అఘోరీ వాహనం చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. కారులోంచి దిగకుండా పోలీసులపై పరుష పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేసింది. తనను అడ్డుకుంటే కత్తితో చేతిని కోసుకుంటానని బెదిరించింది. దీంతో మహిళా పోలీసులు మహిళా అఘోరీని బలవంతంగా కారులోంచి దింపి శరీరంపై దుప్పటి కప్పారు. అనంతరం మహిళా అఘోరీని పోలీస్ వాహనంలో సిద్దిపేటకు తరలించారు. కారును టోషన్ సహాయంతో సిద్దిపేట వైపు తీసుకెళ్లారు. సీఐలు శ్రీనివాస్‌గౌడ్, సదన్ కుమార్, ఎస్ఐలతో భారీ బందోబస్తులో నిర్వహించారు.

కేజీబీవీ పాఠశాల విద్యార్థినికి గాయాలు

తిమ్మాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల(కేజీబీవీ)లో 10వ తరగతి చదువుతున్న మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లికి చెందిన అనన్య ప్రమాదవశాత్తు గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం పాఠశాలలో బుధవారం రాత్రి విద్యార్థినుల మధ్య ఘర్షణ జరిగింది. పెనుగులాటలో అనన్యకు కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అనన్యను అసుపత్రికి తరలించగా చేయి విరిగినట్లు గుర్తించారు. అసలు ఏం జరిగిందనే దానిపై అధికారులను తెలుసుకునే ప్రయత్నం చేయగా వారు స్పందిచలేదు.

రాజన్న ఆలయంలో కామ దహన ఉత్సవం



కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు


వేములవాడ కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కామదహన ఉత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ఆవరణలో రాత్రి ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కామ దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా రాజన్న ఆలయ మండపంలో డోలోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా ఎంపీడీవోలు, మండల పరిషత్ ఉద్యోగులు అభినందించారు.

రైతులకు వరం
పీఎం కిసాన్ మన్‌ధన్



- 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేయకున్నా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన' పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలా మంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్న కారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతి నెల 3 వేల రూపాయల చొప్పున పింఛన్ జీవిత కాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉం డి, రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్నవారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60 ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ పెన్షన్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగినవారు, టాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కాదు. ఈ పెన్షన్ అందే వరకు రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

ప్రీమియం వివరాలు

18 నుంచి 40 సంవత్సరాల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెల 55 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు 55 రూపాయలు జమ చేస్తే ప్రతి నెల 110 రూపాయలు జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు 61 రూపాయల ప్రీమియం, 25 ఏళ్ల వారికి 80, 30 ఏళ్లకు 105, 35 ఏళ్లకు 150, 40 ఏళ్ల వయస్సు వారికి ప్రీమియం 200 రూపాయలుగా ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు 1500 రూపాయల పెన్షన్ వస్తుంది. రైతు ఫోటో, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ కిసాన్ మాన్‌దన్ పదకంలో చేరాలంచే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



దరఖాస్తు చేసుకోవడం ఇలా

- పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి.
- పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతి నెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి.
- నామినీ వివరాలను నమోదు చేయాలి.
- మాన్‌ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి.
- వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రతి నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎం. కేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి.
- పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకొని ఫించన్ కార్డును డౌన్‌లోడ్ చేసకోవచ్చు.
- ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

భగత్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు పదోన్నతితోపాటు, బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు బుధవారం బస్ బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్-2 డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న విమలయ్యకు ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. బోధన డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను కరీంనగర్ డపో-2 మేనేజర్‌గా బదిలీచేశారు. జగిత్యాల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సునీతను గద్వాల్ డిపో మేనేజర్‌గా, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కె.కల్పనను జగిత్యాలడిపో మేనేజర్‌గా, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును కుషాయిగూడకు బదిలీ చేశారు. దిల్‌సుక్‌నగర్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకన్నను హుస్నాబాద్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ సీటీఎస్‌గా పనిచేస్తున్న పీవీ రావును కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎంగా బదిలీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకం

విద్యార్థి అరెస్టు.. 1.30 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న కాలేజీలోనే గంజాయి విక్రయిస్తున్న విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయి సేవించడానికి అలవాటు పడిన అతడు అధిక ఆదాయం కోసం బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి తాను చదువుతున్న కాలేజీలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం రాజును అరెస్ట్ చేసింది. నిందితుడి నుంచి 1.30 కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు
- స్వామి వారల సేవ ఊరేగింపు



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహ (యోగ, ఉగ్ర) స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగింపు జరిపారు. స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభం వద్దకు తీసుకు వచ్చి ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ వేద మంత్రాల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షాన రైస్‌మిల్ యజమానులు, దాతల సహకారంతో 7 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జక్కు రవీందర్ సేవలు అందించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

రెండో రోజు ఆదాయం రూ.5,14,052

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి బుధవారం రూ.5,14,052 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,76,482, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,61,850 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 75,720 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు.



చలవ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి స్థానిక కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ 13 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ కమిటీ సభ్యులుగా ఎదులపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, జక్కు రవీందర్, కొమురవల్లి పవన్ కుమార్, మందుల్ల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంబంకాడి గణేష్ కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నేరేళ్ల శ్రీనివాసా చార్యులను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.




స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, స్వామివారి దర్శనం కోసం ఆలయం బయట బారుల తీరిన భక్తులు

వైభవంగా పూర్ణాహుతి

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణహూతి నిర్వహిస్తున్న వేదపండితులు

మల్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో బుధవారం పూర్ణాహుతి వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంధ పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, సిబ్బంది అశోక్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పవిత్రల ఆలయ ప్రవేశం

సైలెంట్‌గా ఎటాక్

- పెరుగుతున్న కిడ్నీ బాధితులు
- ఆరోగ్యంగా జీవించడానికి మూత్రపిండాలు ప్రధాన పాత్రే..
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కిడ్నీ జబ్బు మనుషులపై సైలెంట్ ఎటాక్ చేస్తుంది. ఎక్కువ శాతం బాధితులు ముందుగా లక్షణాలను గుర్తించకపోవడంతో కిడ్నీ ఫెయిల్‌కి కారణం అవుతుంది. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో ప్రపంచ కిడ్నీ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అనే రెండు సంస్థలు కిడ్నీలపై అవగాహన కల్పించాలని ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఒక అంశాన్ని తీసుకోని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం ముందస్తుగానే సమస్యను గుర్తించి నివారణ - సంరక్షణ అంశంగా ముందుక తీసుకువచ్చింది. చిక్కుడు గింజల ఆకారంలో.. పిడికిలి ప్రమాణంలో.. నడుముకు పైభాగంలో.. పక్కటెముకల కింద మన శరీరానికి రెండు వైపులా ఉండే మూత్రపిండాలు(కిడ్నీలు) ఆరోగ్యంగా జీవించడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి రోజూ లీటర్ల కొద్దీ రక్తాన్ని శుద్ధి చేస్తూ, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతూ నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాలతో ఇప్పుడు ఎంతో మంది కిడ్నీల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

మూత్రపిండాల పనితీరు..

ప్రతి రోజూ కిడ్నీలు రెండువందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేసి రెండు లీటర్ల మలినాలను, అధికంగా ఉన్న నీటిని తీసివేస్తాయి. అలా ప్రతిరోజూ మూత్రపిండంలో 24 గంటలు బొట్లు బొట్లుగా నీరు మూత్రపిండాల్లో ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. యురేటర్ అనే రెండు గొట్టాల ద్వారా మూత్రాశయానికి చేరుతుంది. ఈ సంచి నిండగానే మూత్ర విసర్జన చేసుకోవాలని మెదడులో ఆలోచన కలుగుతుంది. తినే ఆహారంలోని రక్త ప్రవాహం కలిసినప్పుడు అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయి. అలా చేరిన మలినాలను మూత్రపిండాలు సత్వరం శరీరం నుంచి బహిష్కరించకపోతే విషపూరితం అవుతాయి. ఈ పనిని కిడ్నీలు చేస్తాయి.

మూత్రపిండాలకు హాని కలిగించే పరిస్థితులు..


మూత్రపిండాలు ప్రాణాపాయ స్థితికి కూడా చేరుకుంటాయి. దెబ్బలు తగలడం, మితిమీరిన రక్తపోటు, అధిక బ్లడ్‌షుగర్, కొన్ని రోగాలకు వాడే మందుల వల్ల మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. మంచి అలవాట్లు వీటిని నియంత్రిస్తాయి. బరువును అదుపులో పెట్టుకోవడం, పొగతాగడం మానటం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కిడ్నీల్లో రాళ్లు..

కిడ్నీల్లో రాళ్లు తయారు కావడానికి ప్రధానంగా తినే ఆహారంలో కాల్షియం సాల్ట్స్, యూరిక్ యాసిడ్, ఆక్జలైట్, సిస్టిన్ మొదలైన పదార్థాలు ఎక్కువగా ఉండడం. మూత్రం మండలంలో లోపలి పొర దెబ్బతినడం, ఏ విటమిన్ లోపించడం, మూత్ర విసర్జనకు అవరోధం ఏర్పడడం, మూత్రమండలంలో ఇన్‌ఫెక్షన్స్ రావడం, మంచినీళ్ల తక్కువ తాగడం, ప్రోస్టేట్ గ్రంథి వాయడం జరుగుతుంది. రాళ్లు ఎక్కడున్నాయి అనే దాన్ని బట్టి లక్షణాలు వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి..

ముందుగా జబ్బు నిర్ధారణ చేసుకుని అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే ద్వారా కూడా తెలుసుకోవచ్చు. చిన్నరాళ్లయితే కొంత కాలానికి వాటంతట అవే పోతాయి. అందుకోసం అధిక నీళ్లు తాగితే సరిపోతుంది. రాళ్లు ఉన్నాయని నిర్ధారణ తరువాత ఎక్కువ నీళ్లు తాగాలి. నొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్స్ మాత్రలు, చీము కణాలుంటే యాంటీబయాటిక్స్ వాడాలి. చిన్న రాళ్లయితే మూత్రంలో పడిపోతాయి, పెద్దగా ఉంటే మూత్రపిండాలు చెడిపోకముందే సర్జరీ ద్వారా తీయించుకోవాలి. ఒకసారి రాళ్లు తీయించుకుంటే మళ్లీ రావని అనుకోవద్దు.



అన్ని రంగాల్లో డిజిటల్ పరివర్తన

గణేశ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మార్పునకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ పరివర్తన అన్ని రంగాల్లో స్థిరమైన స్థానాన్ని సాధిస్తోందని శాతావాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. 'డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ ఏకే క్యాటలిస్ట్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వ్యాపారాలు పెరిగాయని, మారుమూల గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇలాంటి సమాకాలిన అంశాలపై సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గుప్తా లక్ష్మణ్ సెక్రెటరీ ఏబీఆర్ఎస్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో నడవడానికి విద్య ముఖ్యమైన సాధనమని, విద్యా రంగంలో సమూలమైన మార్పులు తేవడానికి ఆధునికతతో కూడిన అంశాలను జోడిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విశ్వేశ్వరరెడ్డి కలవల గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి డైరెక్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్, డాక్టర్ రవి జాస్పర్ ఇండస్ట్రీస్, విశ్వావిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల నిరసనలను పట్టించుకోని ప్రభుత్వం..



రిలే నిరాహారదీక్షలో మహిళా రైతులు

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కరించాలని రైతులు నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహిళా రైతులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని పెద్ద లింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం 10వ రోజుకు చేరుకోగా దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్ పనులు పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలని నిరసన చేపట్టినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు మండలాల రైతుల దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యేలు రాకపోవడం బాధాకరం అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. మహిళా రైతుల దీక్షకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య సంఘీభావం ప్రకటించారు.

ఇంటి పన్నుల వసూళ్లకు చర్యలు

సతీష్‌కుమార్, డీఎల్‌పీవో, మంథని



ఆంధ్రజ్యోతి: ఇంటి పన్నుల వసూళ్లు ఎలా ఉన్నాయి?

డీఎల్‌పీవో: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ లోపు గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం ప్రతి రోజు కార్యదర్శులతో మాట్లాడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్య కార్యక్రమాలు ఏవిధంగా కొనసాగుతున్నాయి?

డీఎల్‌పీవో: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు డ్రైనేజీలు శుభ్రం చేయడం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నాం. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: నీటి ఎద్దడి లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎల్‌పీవో: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఉండటానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ముందస్తు ప్రణాళికలతో ఇలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకున్నాం.

\- మంథని రూరల్

21నుంచి జిల్లాస్థాయి యువోత్సవం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 12,(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం క్రీడలు యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్ర సంఘటన్, ఆదేశాల మేరకు నెహ్రూ యువకేంద్ర పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 21న జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన నెహ్రూ యువకేంద్ర అధికారి తెలిపారు. జిల్లా స్థాయి యువఉత్సవంలో 15సంవత్సరాల నుండి 29సంవత్సరాలలోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కవిత్వం, పెయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాస పోటీలు, గ్రూపు సాంస్కృతిక పోటీలు, సైన్స్ మేళా (ఇండివిజువల్), గ్రూప్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు కవిత్వం, పేయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ పోటీలకు ప్రథమ బహుమతి 2500, ద్వితీయ బహుమతి 1500, తృతీయ బహుమతి 1000, ఉపన్యాస పోటీకి ప్రథమ బహుమతి 5000, ద్వితీయ బహుమతి 2500, తృతీయ బహుమతి1500,, గ్రూపు సాంస్కృతిక పోటీలకు ప్రథమ బహుమతి 7000, ద్వితీయ బహుమతి 5000, తృతీయ బహుమతి 3000లు ఇవ్వనున్నట్లు తెలిపారు.సైన్స్‌మేళా(గ్రూప్)ప్రథమ బహుమతి 7000, ద్వితీయ 5000, తృతీయ 3000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9గంటలకు మంథనిలోని జేఎన్టీయూలో సంప్రదించాలని తెలిపారు.

పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లి రూరల్ , మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు స్వాగతిస్తూ అడ్మిషన్‌లు ప్రారంభించిన గోడపత్రికను కళాశాల అధ్యాపకులు బుధవారం ఆవిష్కరించారు. కళాశాలలో ఆధునిక బోధన సౌకర్యాలు, పరిశోధన ఆధారిత విద్యాభ్యాసంతో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు వారు తెలిపారు. కళాశాలలో అధిక శాతం పిహెచ్‌డి, యూజీసీ నెట్, టిఎస్‌ఏపీ సెట్ అర్హతలు కలిగిన అసిస్టెంట్, అసోసియే ట్ ప్రొఫెసర్‌లతో కళాశాలలో చేరిన విద్యార్థులకు బోధన అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ తరగతి గదులు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, పరిశోధనాత్మక బోధనను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ద్వారా శిక్షణ అందిస్తున్నారు. అధునాతన సదుపాయాలతో పాటు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్, కళాశాలలో హైస్పీడ్ ఇంటర్నెట్ , డిజిటల్ తరగతి గదులు ద్వారా విద్య అందిస్తున్నట్లు పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.కె.లక్ష్మీ నర్సయ్య తెలిపారు.

● **కళాశాలలో ఐదు కోర్సులకు అడ్మిషన్‌లు**

కళాశాలలో బీఎస్సీ (గణితం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బిఎస్సీ (బోటనీ, జూలాజీ, కెమిస్ట్రీ), బి.కాం (కంప్యూటర్) ఇంగ్లీష్ మీడియం కోర్సులను అందిస్తున్నారు. బీ.ఏ (ఎకానామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ) తెలుగు/ ఇంగ్లీష్, బి.ఏ ఎకనామిక్స్ (పొలిటికల్ సైన్స్, హిస్టరీ, కంప్యూటర్ అప్లికేషన్స్) తెలుగు/ఇంగ్లీష్ మీడియం ఉంది.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెద్దపల్లి డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి : డీపీవో

కాల్వశ్రీరాంపూర్, మార్చి 12,(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట్, ఇదిలాపూర్ గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య గురించి సంబంధిత ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిరణ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **ఓదెల:** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు పూర్తి చేయాలని డీపీఓ వీర బుచ్చయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లతో డీపిఓ వీరబుచ్చయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణ పటిష్టంగా నిర్వహించాలన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై చర్యలు

పెద్దపల్లి రూరల్ : గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దకల్వల గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి చెత్త కనిపించకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నిషాంత్‌లతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు: పారిశుధ్య పనులతో పాటు వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోని లాలపల్లి, ధూళికట్ట, లోకపేట గ్రామాలను సందర్శించారు. అనంతరం ధూళికట్టలో ఉపాధిహామీ పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కోర్టు భవనాలను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి

కోల్‌సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శారదానగర్‌లో నిర్మిస్తున్న కోర్టు భవనాలను బుధవారం జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. కోర్టు భవనాలు, పార్కింగ్ స్థలం, న్యాయమూర్తుల నివాస భవాలను పరిశీలించారు. త్వరితగతిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట నోడల్ ఆఫీసర్, సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్, ఏఓలు రఫికొద్దీన్, శ్రీనివాసరాజు, బార్ అసోసియేషన్ ప్రతినిధుల తౌటం సతీష్, రాంటెంకి శ్రీనివాస్, పులిపాక శ్రీనివాస్, మహేందర్, సంతోష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వనందుకే బీఆర్‌ఎస్ నాయకులు కౌశిక హరి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ తమ పనులు అడ్డుకుంటున్నాడని ఇటుక బట్టీల యజమానులు ఆడెపు వెంకటేష్, శ్యామ్‌లు ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో నడుస్తున్న టిప్పర్లను ఫొటోలు తీసి మట్టి చెరువులో నడుస్తున్నట్లు పాటపెట్టి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తూ తమను కౌశిక హరి మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది మేలో తాము ముర్మూర్ చెరువు నుంచి ప్రభుత్వానికి సీనరేజ్ ట్యాక్స్ చెల్లించి ఒడ్డుపైన మట్టి డంప్ చేసుకున్నామని, ఆ మట్టిని ఇప్పుడు బట్టీలకు తీసుకువెళుతుంటే అడ్డుకుంటూ కౌశిక హరి డబ్బులు డిమాండ్ చేశాడని, ఆ డబ్బులు ఇవ్వనందుకే తమపై కక్ష గట్టారని వారు ఆరోపించారు. చెరువు మట్టి బట్టీలకు తప్ప దేనికి ఉపయోగపడదని, కానీ తమ వద్ద పని చేస్తున్న కుటుంబాలను రోడ్డున పడేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని, పోచమ్మ గుడిలో ప్రమాణం చేసింది అబద్ధమని, ఆయన ఎంతటికైనా దిగజారుతాడన్నారు. దీనిలో స్థానిక ఎమ్మెల్యేను లాగడం సరైంది కాదని, రాజకీయాల కోసం దిగజారడం 30ఏళ్ల నుంచి పెట్టిన విద్య అన్నారు. స్థానిక సమస్యలపై ఎప్పుడూ పోరాటం చేయని కౌశిక హరి రామగుండంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిపై ఏనాడైనా పోరాటం చేశారా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ది కోసం తమను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో ఇటుక బట్టీల యజమానులు సతీష్, కుమార్, శ్రీకాంత్, రాజు, రవి, మధు, కృష్ణ, వంశీ, నరేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఇటుక బట్టీల యజమానులు

ఘనంగా రథోత్సవం

సుల్తానాబాద్ , మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారికి చక్రస్నానం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల మధ్య స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిసాయి.

ఆపిల్ కిడ్స్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే

కమాన్‌పూర్, మార్చి 12,(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నానమ్మ తాత, అమ్మమ్మ తాతయ్యలు పాఠశాలకు విచ్చేసి వారి మనుమలు, మనుమరాళ్లను ఆశీర్వదించారు. పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకటరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, గౌతమి, జేబా, చామంతి, ప్రియాంక, రజిత పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

జూలపల్లి, మార్చి 12. (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు పరీక్షా ప్యాడ్‌లు,పెన్నులను అందజేసారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్స్‌పాల్ నవీన్, ఫౌండేషన్ సభ్యులు ఉయ్యాల క్రాంతికుమార్, నవీన్, ఇస్మైల్ పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముస్కు లింగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ముస్కు మధూకర్ 44 మందికి విద్యా సామగ్రిని అందజేశారు.

పోలీస్‌శాఖ అవగాహన సదస్సు

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలపై ఎస్‌ఐ చంద్రకుమార్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ రాజు ముఖ్యఅతిథిగా హాజరై శాంతి భద్రతలపై మాట్లాడారు.

రిజిస్ట్రేషన్‌కు ఎల్‌ఆర్‌ఎస్ బ్రేకులు

(5వ పేజీ తరువాయి)

ఎల్‌ఆర్‌ఎస్ రావడంతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. మరోపక్క ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోని వారు చాలా మంది ఉన్నారు. అలా దరఖాస్తు చేసుకోకుండా ప్లాట్ల క్రయవిక్రయాల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ రూపేణా డబ్బులు వసూలు చేయనున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో క్రయ, విక్రయదారులు ఆందోళన చెందుతున్నారు.

మంథని ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

● **మాజీ ఎమ్మెల్యే పుట్టమధు**

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీల ద్వారా ప్రమాదాలకు కారకుడైన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై కేసు నమోదు చేసి పోలీసులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు డిమాండ్ చేశారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఇటీవల ఇసుక లారీల ప్రమాదంలో మృతి చెందిన దొంతుల వాణి సభ్యులను పరామర్శించి మాట్లాడారు. తాను గెలిచిన తర్వాత రెండు రోజుల్లోనే ఇసుక రవాణాను బంద్ చేయిస్తా అని ప్రగల్భాలు పలికిన మంత్రి పదిహేను నెలలైనా ఎందుకు పట్టించుకోవడం లేదో మంథని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. 15 నెలలుగా ఇసుక రవాణా ఆపడంలో మంత్రి నిర్లక్ష్యం మూలంగానే సుమారు 35 మంది బలయ్యారని అందుకు కారణమైన ప్రభుత్వ బాధ్యునిగా దుద్దిల్ల శ్రీధర్‌పై 106 బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలకు రూ. 50 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్, నాయకులు కాపురబోయిన భాస్కర్, ఆసంతిరుపతి, సైండ్ల సత్యనారయణ, మల్యాల మోహన్, రేండ్ల అశోక్ తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ధర్మారం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేలా కేంద్రం తలపెట్టిన ట్విన్నింగ్ ప్రోగ్రాంను ధర్మారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు బొమ్మరెడ్డిపల్లి, గోపాల్‌రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాధికారి పోతు ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు ఎల్.మాలతి, రాజేష్, మధునయ్య, ఉపాధ్యాయులు అంజయ్య, అరుణ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్రయోజనం

ఎలిగేడు, మార్చి 11,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూమి రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)ద్వారా అత్యధిక ప్రయోజనం పొందవచ్చని ఎంపీవో ఎండి. ఆరిఫ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూమి విలువ రెట్టింపు పెరుగుతుందన్నారు. నూతన భవన నిర్మాణాలకు అనుమతులు సులభంగా పొందవచ్చని తెలిపారు. ప్లాట్ల విక్రయాలు, భూ బదిలీలు చేసుకోవడంతో పాటు బ్యాంకు ఋణాలు, ఆర్థిక లావాదేవీలపై అర్హత పొందే అవకాశం ఉందన్నారు. 31లోపు చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

భూ ఆక్రమణపై విచారణ జరిపించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో తన భార్య పేరుపై వ్యవసాయ భూమి కొనుగోలు విషయంలో ఒప్పందం ప్రకారం పూర్తి డబ్బులు చెల్లించకుండా అక్రమంగా భూఆక్రమణకు పాల్పడ్డ పెద్దపల్లి మండలం రంగాపూర్ పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుమ్మడి సదయ్యపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. లావణ్య అధికారులను కోరారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా పంచాయితీ అధికారి వీర బుచ్చయ్యలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తారం మండల మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంథని, ముత్తారం మండలానికి చెందిన కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు సాగునీటి విషయంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.

పాఠశాలను సందర్శించిన రాష్ట్ర స్థాయి బృందం

మంథని, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరును పరిశీలించడానికి హైదరాబాద్ ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పాఠశాలలను సందర్శిస్తున్న రాష్ట్ర స్థాయి బృందం మంథని బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. వివిధ అంశాలను వారు పరిశీలించారు.

దోచుకోవడానికే బీఆర్‌ఎస్ ఇసుక పాలసీ : కాంగ్రెస్

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సహజ వనరులను దోచుకొని దాచుకోవడం కోసమే రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇసుక పాలసీని అమలులోకి తెచ్చిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న ఆరోపించారు. బుధవారం మండలంలోని ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా ఇసుక రవాణా చేసే ప్రతి లారీని బంద్ చేపిస్తా అనే మాటాపై మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు బర్లశ్రీనివాస్, తులసీరాంగౌడ్, ఆరెల్లికొంరయ్యగౌడ్, రామూర్తి, గంటవెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

ఓడేడ్ గ్రామస్థుల నిరసన

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడెడ్ మానేరు రహదారి టోల్‌గేట్ నిలుపుదలతో ఓడేడు గ్రామ అభివృద్ధి, మల్లన్న గుడి భూములు, ఓడేడు గ్రామ రైతుల వద్ద కొనుగోలు కోసం ఏర్పాటు చేసుకున్న భూమి కొనుగోలు నిలిసిపోయినట్టే అని ఓడేడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

సీతంపల్లి వాసికి గ్రూప్-2లో 143 ర్యాంకు

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపల్లి గ్రామానికి చెందిన గంట మహేష్ గౌడ్ గ్రూప్-2 ఫలితాలలో 143 ర్యాంక్ సాధించాడు. ఇంతకు ముందు గ్రూప్-4 ఫలితాలలో విజయం సాధించి ప్రస్తుతం పెద్దపల్లి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పట్టుదలతో సివిల్స్ ప్రిపేర్ అయిన మహేష్‌గౌడ్ మొదటి సారి సివిల్స్ రాకపోవడంతో గ్రూపు-4లో విజయం సాధించారు.



మహేష్ గౌడ్

ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన డీవైఎఫ్‌ఐ బృందం

కళ్యాణ్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారిందని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిని డీవైఎఫ్‌ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సౌకర్యాలు సరిగా లేవని, కనీసం తాగునీరు కూడా లేదన్నారు.

ఖనిలో దళితుల నిరసన ర్యాలీ, ప్లకార్డుల ప్రదర్శన

కోల్‌సిటీటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది తౌటం సతీష్ నల్లకోటు ముసుగులో దళితులు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ దందాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ జనగామ తాజామాజీ కార్పొరేటర్ జనగామ కవితసరోజిని, దళిత నాయకులు బుధవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో నిరసన తెలిపారు. ప్లకార్డులతో ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవితసరోజిని మాట్లాడుతూ తౌటం సతీష్ నల్లకోటు ముసుగులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అంటూ తాను ఏం చేసినా చెల్లుతుందంటూ భూకబ్జాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు.



సెక్టార్-3 డిస్పెన్సరీలో అధునాతన వైద్య పరికరాలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-2 ఏరియాలోని కాలనీ సెక్టార్-3 డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన ఆధునాతన వైద్యపరికరాలు ట్రెడ్‌మిల్, క్రయోథెరిపి, హైలైట్, అల్ట్రా సౌండ్ మసాజర్‌లను బుధవారం ఆర్‌జీ-2 జీఎం వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర గ్రామాల ప్రజలు వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామగుండం రీజియన్ ఏసీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురురవీందర్, వకీల్‌పల్లి గని ఏజెంట్ నెహ్రూ, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ ఉన్నారు.

కాంట్రాక్టు పద్ధతిలో అధికారుల నియామకంపై ఆందోళన

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ కొరకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ ప్రకటనపై బుధవారం అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థలో విభాగ అధిపతులుగా, సర్వీస్ లేని బయటి వ్యక్తులను నియమించడం సరైంది కాదన్నారు. సింగరేణి సంస్థ అన్ని కష్ట సమయాలలో, అలాగే కరోన మహమ్మారితో పోరాడే సమయాలలో కంపెనీ మార్గదర్శకత్వంలో, అద్భుతంగా పని చేశారని, ఆ సమయంలో కొంత మంది అధికారులు, ఉద్యోగులు కూడా ప్రాణపాయ స్థితిలోనికి వెళ్లడం, పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. 30సంవత్సరాలకు పైబడి అనుభవం కలిగి సర్వీస్‌లో ఉన్న వారిని జవాబు దారితనంతో పనిచేసే వారిని కాకుండా, కొత్త పద్ధతిలో బయట వ్యక్తులను తాత్కాలికంగా నియమించటానికి ప్రయత్నించటం, అంకితభావంతో పనిచేసే అధికారులను నిరుత్సాహపరిచే విధంగా ఉందన్నారు. బయట వ్యక్తులకు సంస్థలోని పద్ధతులపై అవగాహన, సమన్వయం కష్టతరంగా ఉంటుందన్నారు. జవాబుదారీ తనం లోపిస్తుందన్నారు. మెడికల్ ఆఫీసర్‌లకు సంబంధించి, ఇప్పటికే సంస్థలో స్పెషలిస్ట్ డాక్టర్లు కంపెనీలో కొనసాగటానికి నిరుత్సాహంగా ఉన్న తరుణంలో, ప్రస్తుత పదోన్నతి అవకాశాలు కూడా నిరాకరిస్తే, ఈ స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత సమస్య మరింత ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచ్ జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, ఆర్‌జీ-1 ఏరియా ప్రెసిడెంట్ ఎస్ మధుసూదన్, సెక్రటరీ చంద్రశేఖర్, నరేశ్, జనార్ధన్, సుగుణాకర్ ఉన్నారు.

బొగ్గుగనుల వేలంతో సింగరేణి అస్తిత్వానికే ప్రమాదం

● **టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

గోదావరిఖని, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలం పాటలో సింగరేణి సంస్థ పాల్గొనడాన్ని టీబీజీకేఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయంతో సంస్థ అస్తిత్వాన్ని కోల్పోతుందని, సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థంగా మారుతుందన్నారు. బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనడం అంటే ప్రైవేట్ వారికి అనుమతిచ్చినట్టుగానే పరిగణించాల్సిన అవసరం ఉంటుందని, యథేచ్ఛగా బొగ్గు తీసుకునే అవకాశం కల్పించినట్టు అవుతుందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అనుమతి ఇవ్వాలంటూ ఆహ్వానించడం కార్మిక వ్యతిరేక చర్య అని, కార్మికులను, సంస్థను ఇబ్బందుల్లోకి నెట్టే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో ప్రైవేటీకరణ ఆలోచన లేకుండా ముందుకు పోయినప్పుడే సంస్థ లాభాల బాటలోకి వస్తుందని, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలతో పాటు సింగరేణిలోని కార్మిక సంఘాలు దీనిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల వేలంలో ఒకసారి పాల్గొంటే ఆ బ్లాక్ రాకపోతే సింగరేణి పరిస్థితి ఏమిటని, సింగరేణి సంస్థలో ఉన్న బొగ్గు బ్లాకులు టెండర్లు వేసినట్లయితే పోటీగా ప్రైవేట్ వారు దక్కించుకుంటే సంస్థ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రైవేట్ వ్యక్తులు గుత్తాధిపత్యం పెరిగిపోతుందని, ఈ బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనవద్దన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ రెండు నాలుకల ధోరణి అవలంభిస్తుందని, దీనిని కార్మికవర్గం గ్రహించాలన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, సంపత్‌రెడ్డి, సాంబయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, జోసఫ్, మల్లేష్, అఫ్సర్‌పాషా, సాయి, శంకర్, తిరుపతి, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

వార్షిక ఉత్పత్తి లక్ష్యంలో ఆర్జీ-3 ముందు వరుస

\- జీఎం సుధాకర్‌రావు

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో ముందు వరుసలో నిలిచిందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి సంస్థ 2024-25 నిర్దేశించిన వార్షిక లక్ష్యం 27.50 లక్షల టన్నులకు వార్షిక సంవత్సరానికి ఇరువై రోజుల ముందుగానే 27.52 లక్షలను సాధించి వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కృషిచేసిన సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించిన సీఎండీ బలరాం, డైరెక్టర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గడువులోగా ఉత్పత్తి సాధించేందుకు ఓసిపి-2 విస్తరణకు సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు, స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌జీ-2లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-2 ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సేవా అధ్యక్షురాలు వనజా వెంటయ్య, ఆర్‌జీ-2 జీఎం బి.వెంకటయ్య ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగవారితో సమానంగా పోటీపడుతున్న మహిళలు కొన్ని రంగాలలో కొంత వివక్షతకు గురవుతున్నారని, అయినా ఆత్మసైర్యంతో ముందుకుపోతూ సత్తాను చాటుతున్నారన్నారు. మహిళా సాధికారతకు పట్టం కట్టేలా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఎన్నో విజయాలను సాధిస్తున్నారని, సింగరేణి సంస్థలో కూడా మహిళలు అన్ని విభాగాల్లో పనిచేస్తూ సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సోనాలిబైద్య, డీజీఎం పర్సనల్, అధికారప్రతినిధి ఎస్.అనిల్‌కుమార్, ఎస్.కవిత, కల్పన, సునిత, ఏజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం ఇఇ మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకటరామచంద్ర, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్, డీవైపీఎం శ్యామ్‌ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్, నరేందర్‌రెడ్డి, సేవా కోఆర్డినేటర్ దేవరెడ్డి, ఆర్‌జీ-2 మహిళా ఉద్యోగులు, సేవ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జీఎం వెంకటయ్య, సేవ అధ్యక్షురాలు వనజ